నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 31 డిసెంబర్ 2024 | NAGARKURNOOL

'డబుల్' ఇండ్లు అప్పగించాలి

కల్వకుర్తిలో డబుల్ బెడ్రూం ఇండ్లు అప్పగించాలని ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

- కల్వకుర్తిలో టెంట్ వేసుకొని చీపుర్లు, బకెట్లతో వచ్చి లబ్ధిదారుల ధర్నా
- కాల యాపన చేయడంపై ఆగ్రహం

కల్వకుర్తి, డిసెంబర్ 30 : కల్వకుర్తి మున్సిపాలిటీలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు మరో సారి ఆందోళనకు దిగారు. ఈనెల 30 వరకు ఇండ్లను లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సోమవారం ఇండ్ల సముదాయానికి లబ్ధిదారులు చీపుర్లు, బకెట్లతో చేరుకొని టెంట్ వేసుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఇళ్లు లేని నిర్భాగ్యుల కోసం మున్సిపాలిటీలో సర్వే నెంబర్ 99 ప్రభుత్వ భూమిలో 240 ఇండ్లు నిర్మించిందని తెలిపారు. తర్వాత కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహించి అర్హులను ఎంపిక చేశారని వివరించారు. అంతలోనే ప్రభుత్వం మారడంతో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు వాటిని అందించకుండా కాల యాపన చేస్తోందన్నారు. ఏడాది కాలంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను కలిసినప్పుడు అప్పుడు.. ఇప్పుడు.. అంటూ కాలం వెళ్లదీస్తున్నారని దుయ్యబట్టారు. గత నెలలో ఎమ్మెల్యేను అడిగితే డిసెంబర్ 30వ తేదీ వరకు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వెంటనే అందజేస్తే ఇండ్లను శుభ్రం చేసుకుని నివాసం ఉంటామని లబ్ధిదారులు తెలిపారు. ఎమ్మెల్యే తమకు మాట ఇచ్చి మోసం చేశారని వాపోయారు. ఎమ్మెల్యే వచ్చి వెంటనే తమకు ఇండ్లు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకొన్న ఎస్సై మాధవరెడ్డి అక్కడికి చేరుకొని ధర్నా విరమింపజేయాలని వారికి నచ్చజెప్పే యత్నం చేశారు. తమకు ఇండ్లు ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. మమ్మల్ని జైలుకు తరలించినా సరే ధర్నా విరమించేది లేదని తేల్చి చెప్పారు. దీంతో అతను అక్కడి నుంచి వెనుదిరిగారు.

ప్రజావ్యతిరేక పాలనపై కవులు, కళాకారులు స్పందించాలి



కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనపై రూపొందించిన పాటను విడుదల చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- 'కాంగ్రెస్ వచ్చిందిరా సాయన్న.. పంటలు ఎండుతున్నాయిరా నాగన్న' అన్న పాట విడుదల

వనపర్తి టౌన్, డిసెంబర్ 30 : నేడు రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా వ్యతిరేక పాలనపై, ప్రజా నిర్బంధాలపై కవులు, కళాకారులు, మేధావులు స్పందించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. నేడు రాష్ట్రంలో సాగుతున్న అరాచక, ప్రజావ్యతిరేక పాలనపై, రైతులు పడుతున్న గోసను చూసి 'కాంగ్రెస్ వచ్చిందిరా సాయన్న.. పంటలు ఎండుతున్నాయిరా.. నాగన్న' అన్న పాట రాజనగరానికి చెందిన ఎరుపు భరత్‌యాదవ్ రూపొందించారు.. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిరంజన్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భరత్ ప్రజల కష్టాలను కండ్లకు కట్టేలా మంచి పాటను రూపొందించారని అభినందించారు. ఈ పాటకు దండోరా నాయకులు మీసాల రామన్న సంగీత, దర్శకత్వం వహించినట్లు చెప్పారు. అనంతరం భరత్‌ను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మీసాల రామన్న, గంధం నాగరాజు, కురుమూర్తి యాదవ్, వాకిటి శ్రీధర్, రమేశ్, గౌడ్, అశోక్, మాణిక్యం, కృష్ణ, నాగన్న యాదవ్, రహీం, గులాం ఖాదర్‌ఖాన్, రవిప్రకాశ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగేంద్రం, మాధవ్‌రెడ్డి, ఇమ్రాన్, రాము, డానియేల్, శివ, లక్ష్మణ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్‌కు స్వల్పంగా టీబీ డ్యాం నీరు

ఆర్డీఎస్ ఆనకట్టలో 6.7అడుగులకు చేరుకున్న నీటి నిల్వ

అయిజ, డిసెంబర్ 30 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇండెంట్ నీరు స్వల్పంగా చేరుతున్నది. కర్ణాటకలోని టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్ ఆనకట్టకు ఈనెల 26వతేదీన నీరు విడుదల చేయడంతో తుంగభద్ర నదిలో ప్రవహిస్తూ ఆర్డీఎస్‌కు చేరుతున్నది. సోమవారం ఆర్డీఎస్ ఆనకట్టకు 380క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, 420క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉన్నది. 300 క్యూసెక్కులు ఆర్డీఎస్ ఆయకట్టుకు చేరుతుండగా, 120 క్యూసెక్కులు ఆర్డీఎస్ స్లూయిస్ గుండా దిగువకు ప్రవహిస్తుంది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 6.7అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ శ్రీనివాస్ తెలిపారు. టీబీ డ్యాం నుంచి జనవరి 5వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగుండగా, జనవరి 10 వరకు ఆర్డీఎస్ ఆనకట్టలో నీటిమట్టం నిలకడగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆర్డీఎస్ ఆనకట్టకు నీటి చేరిక మొదలు కావడంతో ఆయకట్టుకు నీటి విడుదల పెంచుతున్నట్లు ఈఈ పేర్కొన్నారు. మూడురోజుల్లో ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి సుంకేసుల బ్యారేజీకి ఇండెంట్ నీరు చేరుతున్నదని వెల్లడించారు. ఆర్డీఎస్ ఇండెంట్‌తో పాటు కేసీ కెనాల్ ఇండెంట్‌ను జాయింట్‌గా విడుదల చేసి ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నట్లు ఈఈ తెలిపారు.

టీబీ డ్యాంలో 82.463టీఎంసీల నిల్వ..

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలో ప్రస్తుతం నీటి నిల్వ 82.463 టీఎంసీలు ఉంది. సోమవారం టీబీ డ్యాం ద్వారా కర్ణాటక పరిధిలోని కాల్వల తోపాటు తెలంగాణ, ఏపీ రాష్ట్రంలోని ఆయకట్టుకు సాగునీరు అందించే హెచ్ ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ కాల్వలకు 9,035 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. ప్రస్తుతం డ్యాంలోకి 245క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌లో 9,035 క్యూసెక్కులు ఉంది. టీబీ డ్యాంలో ప్రస్తుతం 82.463 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, 1626.78 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు ఆయన తెలిపారు.



'అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని' అన్న చందంగా తయారైంది.. మహబూబ్‌నగర్ జిల్లాలో డబుల్ బెడ్రూం ఇండ్ల పరిస్థితి. గూడులేని నిరుపేదలకు ఓ సౌధం ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వంలో డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించింది. అయితే ప్రభుత్వం మారడంతో డబుల్ ఇండ్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. బీఆర్ఎస్ హయాంలోనే అన్ని హంగులతో భవన నిర్మాణాలు పూర్తయినా.. నేటికీ చాలా వరకు లబ్ధిదారులకు కేటాయించలేదు. ప్రజాపాలన సర్కారు కొలువు దీరి ఏడాది పూర్తయినా నేటికీ గృహప్రవేశాలు మాత్రం చేయలేదు.

– మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, డిసెంబర్ 30

గృహయోగం ఎప్పుడో..?

- అందని ద్రాక్షగా డబుల్ ఇండ్లు
- పాలమూరులోని మౌలాలిగుట్ట వద్ద రూ.32 కోట్లతో డబుల్ బెడ్రూంల నిర్మాణం
- కేసీఆర్ ప్రభుత్వంలోనే పూర్తి
- పంపిణీకి 588 గృహాలు
- పట్టించుకోని ప్రజాపాలన ప్రభుత్వం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడక గదులు ఇండ్లు తమ లబ్ధిదారులకు కేటాయించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మౌలాలిగుట్ట ప్రాంతంలో సుమారు రూ.32 కోట్లతో 28 బ్లాకులుగా 588 ఇండ్లను నిర్మించారు. బీఆర్ఎస్ హయాంలోనే కొందరు లబ్ధిదారులకు ఇండ్లు కేటాయిస్తూ అందుకు సంబంధించిన పట్టాలు కూడా అందించింది. మరికొందరి పేర్లు ప్రకటించారు. కానీ నేటికీ లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రాత్రి వేళల్లో కొందరు ఆకతాయిలు తాళాలు పగలగొట్టి విద్యుత్ సామగ్రి, ఇతర వస్తువులను దొంగిలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నీళ్లు ఇచ్చి.. తాళాలు అప్పగించాలి

నిరు పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు పాలమూరు నలువైపులా దివిటిపల్లి, క్రిస్టియన్‌పల్లి, సక్కనిరాయి, ఏనుగొండ ప్రాంతాల్లో రెండు పడక గదుల ఇళ్లు నిర్మించాం. వాటిలో మూడు దిక్కులా పంపిణీ పూర్తి చేయగా.. మౌలాలిగుట్ట వద్ద నిర్మించిన ఇండ్ల పట్టాలు కొందరికి పంపిణీ చేశాం. ఇంకొందరికి ఇవ్వాల్సి ఉండే. నెల రోజుల్లో నీళ్లిచ్చి.. రోడ్లు వేసి, మౌలిక సదుపాయాలు కల్పించి గృహప్రవేశాలు చేయించే అవకాశం ఉన్నా.. గతేడాది ఏ స్థితిలో ఉన్నాయో..? అదే స్థాయిలో ఇప్పటికీ అలాగే ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్మించిన డబుల్ ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించి గృహప్రవేశాలు చేయించాలి. వీళ్లు నిర్లక్ష్యం చేయడంతో నిరు పేదలపై భారం పడుతోంది.

- శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి

- కలల సౌధం కోసం పేదల ఎదురుచూపులు

మౌలిక వసతులు సైతం కల్పించలేదు

ఇళ్లు నిర్మించినా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు సౌకర్యం కల్పించలేదు. సౌకర్యాలు కల్పిస్తే ప్రతి ఒక్కరూ ఇక్కడ నివాసం ఉండే అవకాశం ఉంది. గూడు లేని నిరు పేదలు అద్దె భారం మోయలేక నానా పాట్లు పడుతున్నారు. మౌలిక సౌకర్యాలు త్వరగా కల్పిస్తే ప్రతి నెలా చెల్లించే అద్దె భారం తప్పనున్నది. అయితే ఇళ్లు పంపిణీ చేసినా తమను పట్టించుకోవటం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలన ప్రభుత్వం త్వరగా పనులు పూర్తి చేసిన నిరు పేదలను ఆదుకోవాలని, రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వారం కింద తెచ్చినా..

మాది చారకొండ మండలం సిరుసనగండ్ల గ్రామం. నేను నాలుగెకరాల్లో పత్తి పంటను సాగు చేశాను.. దిగుబడి రాగానే సీసీఐ కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు గత సోమవారం ఇక్కడికొచ్చాను. కిరాయి ట్రాక్టర్‌లో పత్తి తెచ్చాను. కొనకపోవడంతో ఇక్కడే పడిగాపులు కాస్తున్నా.. కిరాయి పెరిగిపోతుంది. ట్రాక్టర్ మిల్లు వద్దనే పెట్టి రోజూ వచ్చి తిరిగి ఇంటికి వెళ్లి పోతున్నా. అధికారులు స్పందించి కొనుగోలు చేయాలి.

- పశుల విష్ణు, రైతు, సిరుసనగండ్ల, చారకొండ

చారకొండ మండలం మర్రిపల్లి సమీపంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై పత్తి డీసీఎంతో బైఠాయించిన రైతులు

తేమ పేరుతో కొర్రీలు

ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని అమ్ముకుందామంటే అధికారులు లేనిపోని కొర్రీలు పెడుతున్నారు. కోటి ఆశలతో తెల్లబంగారాన్ని సీసీఐ కేంద్రానికి తీసుకొస్తే తేమ పేరుతో తక్కువ ధర కేటాయిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఇవ్వడం లేదు. కనీసం తాము పెట్టిన పెట్టుబడులు కూడా రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కొర్రీలు పెట్టకుండా పత్తిని కొనుగోలు చేసి ఆదుకోవాలి.

- లక్ష్మమ్మ, ఎర్రగుంటపల్లి, నల్లగొండ జిల్లా

రోడ్డెక్కిన పత్తి రైతు

- పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్
- వారం రోజులుగా మిల్లు వద్ద పడిగాపులు
- ఆగ్రహంతో జడ్చర్ల–కోదాడ హైవేపై రాస్తారోకో
- రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

చారకొండ, డిసెంబర్ 30 : పత్తిని కొనుగోలు చేయడం లేదని కర్షకన్న కన్నెర్ర చేశాడు. నాగర్‌కర్నూల్–నల్లగొండ జిల్లాల సరిహద్దులో ఉన్న తిరుమల కాటన్‌మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రం వద్ద వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. సోమవారం చారకొండ మండలం మర్రిపల్లి సమీపంలో జడ్చర్ల–కోదాడ హైవేపైకి చేరిన రైతులు పత్తి వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టి పెద్ద ఎత్తున రాస్తారోకో చేపట్టారు. ఆరుగాలం కష్టించి పండించిన తెల్లబంగారాన్ని కొనుగోలు చేయకుండా నిలిపివేసి సీసీఐ, మార్కెటింగ్ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం పత్తి క్వింటాకు రూ.7,521, రూ.7,471, రూ.7,421 చొప్పున ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించిందన్నారు. కానీ తేమ, కాయ పేరుతో పూర్తి స్థాయిలో ధరను వేయకుండా సీసీఐ బయర్లు కొర్రీలు పెడుతున్నారని వాపోయారు. ఏడు రోజులుగా పత్తితో ఇక్కడికి వచ్చామని, పత్తి తెచ్చిన వాహనాల కిరాయి పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో వర్షాధారంపై ఆధారపడి ఎక్కువగా పత్తినే సాగు చేస్తుంటారని, కానీ ఈసారి ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పండించిన కొంత పంటకైనా మద్దతు ధర కోసం సీసీఐ కేంద్రానికి వస్తే ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. రైతుల ఆందోళనతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకొన్న ఎస్సై శంషొద్దీన్ అక్కడకు చేరుకొని మార్కెట్ కార్యదర్శి కిరణ్‌కు ఫోన్‌లో సమాచారమిచ్చాడు. కార్యదర్శితోపాటు సీసీఐ అధికారులు వచ్చి కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో వారు శాంతించి ఆందోళన విరమించారు.

మిల్లు వద్ద నిలిచిన పత్తి వాహనాలు

ధర్నాతో నిలిచిపోయిన వాహనాలు

మృత్యువులోనూ వీడని ప్రేమబంధం

- క్షణికావేశంతో ప్రేమికుల ఆత్మహత్య
- కాకర్లపహాడ్‌లో విషాదచాయలు

అంకిత, చందు (ఫైల్)

నవాబ్‌పేట, డిసెంబర్ 30 : వారిద్దరూ గాఢంగా ప్రేమించుకున్నారు.. జీవితాంతం కలిసే బతకాలని నిర్ణయించుకున్నారు.. కానీ ఇంతలోనే ఏం జరిగిందో తెలియదు.. క్షణికావేశంతో ఒకరి తర్వాత ఒకరు తనువు చాలించి మృత్యువులోనూ వీడని ప్రేమబంధంగా నిలిచిన ఘటన నవాబ్‌పేట మండలంలో చోటు చేసుకున్నది. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. కాకర్లపహాడ్‌కు చెందిన చాకలి అంకిత(18) జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా కాళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుండగా.. అదే గ్రామానికి చెందిన చందుకు మాల్(20) జిల్లా కేంద్రంలోని వాసవి డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వీరిద్దరూ గత రెండేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా ఏమి జరిగిందో తెలియదు కానీ ఆదివారం సాయంత్రం అంకిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ విషయం తెలుసుకున్న చందు తీవ్రంగా కంగారు పడ్డాడు. ఎంతో గాఢంగా ప్రేమించిన అమ్మాయి మృతి చెందిందని, ఇక నేను కూడా బతకలేనని ఆత్మహత్య చేసుకున్నాడో.. లేక అమ్మాయి తన వల్లే మృతి చెందిందనే.. అపవాదు తనపై వేస్తారనుకున్నాడో తెలియదు. కానీ అదే రోజు రాత్రి అందరూ నిద్రకు ఉపక్రమించిన తర్వాత గ్రామ శివారులోని ఒక చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లారే సరికి ఇద్దరూ మృతి చెందారనే విషయం గ్రామంలో తెలియడంతో గ్రామస్థులంతా నివ్వెరపోయారు. బంగారు భవిష్యత్ ఉన్న విద్యార్థులు ఇలా ఆత్మహత్య చేసుకోవడం ఏమిటని పలువురు వాపోతున్నారు. కాగా ఈ ఘటనపై ఎస్సై విక్రమ్ మాట్లాడుతూ ఇద్దరి కుటుంబ సభ్యులు వేర్వేరుగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. క్షణికావేశంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ ప్రేమ వ్యవహారంతోనే ఇలా జరిగిందని ఇవ్వలేదని ఎస్సై వివరించారు. ఈ ఘటనపై వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విక్రం వివరించారు.

మార్చి 31 వరకు సాగునీళ్లివ్వాలి

- గద్వాల కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందించిన రైతులు

అయిజ, డిసెంబర్ 30 : ఆర్డీఎస్ ఆయకట్టుకు మార్చి 31వ తేదీ వరకు సాగునీరు అందించాలని అయిజ మండలంలోని ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు కలెక్టర్ సంతోష్‌ను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రజావాణిలో రైతులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈఏడాది ఆర్డీఎస్ ఆయకట్టులో 37వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని, అయిజ మండలంలో ఆరుతడి పంటలకు భూములు అనుకూలం కాకపోవడంతో వరి సాగు చేశామని, వరి పంటకు మార్చి చివరి వరకు నీరు అందిస్తే పంటలు చేతికొస్తాయని, అప్పటి వరకు ఆర్డీఎస్ ఇండెంట్ నీటితో పాటుకర్నూల్ జిల్లాలోని కేసీ కెనాల్ నీటిని తుంగభద్ర నది ద్వారా విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కేసీ కెనాల్ ఇండెంట్ 10 టీఎంసీలు, ఆర్డీఎస్ ఇండెంట్ 5.896 టీఎంసీల నీటిని విడుతల వారీగా టీబీ డ్యాం నుంచి విడుదల చేసి పంటలు పండించుకునేందుకు అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్డీఎస్ ఈఈ శ్రీనివాస్‌తో నీటి విడుదల ఎప్పటి వరకు ఇవ్వవచ్చో చెప్పాలని కలెక్టర్ ఆదేశించారు. కర్నూల్ జిల్లాలోని కేసీ కెనాల్, ఆర్డీఎస్ ఇండెంట్‌ను జాయింట్‌గా విడుదల చేస్తే వచ్చే మార్చి చివరి వరకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందని, ఆ దిశగా ఏపీలోని కర్నూల్ ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని మార్చి చివరి వరకు నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో కలెక్టర్ రైతులకు నీటి విడుదలపై హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.



గద్వాలలో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు







జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నమస్తే తెలంగాణ సీఎండీ దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, పార్లమెంటరీ బీఆర్ఎస్ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల, రాజేందర్‌రెడ్డి, అంజయ్య, నాయకులు

తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లిలో సోమవారం జరిగిన మర్రి జంగిరెడ్డి ఏకాదశ దినకర్మలో పలువురు ప్రముఖులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యులు, నమస్తే తెలంగాణ సీఎండీ దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, పార్లమెంటరీ బీఆర్ఎస్ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాగం జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్య, రసమయి, క్రాంతి కిరణ్, మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సురేందర్, రాములు, పలువురు కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, బీఆర్ఎస్ రాష్ట్ర, ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొని మర్రి జనార్దన్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

- తిమ్మాజిపేట, డిసెంబర్ 30